క్లుప్తంగా

స్పెషల్ శానిటేషన్ డ్రైవ్



పనులు చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

మధిర: మధిర మున్సిపాలిటీ పరిధిలోని 8, 9, 11, 12 వార్డుల్లో సోమవారం స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మొండితోక లత పాల్గొని మాట్లాడారు. పారిశుద్ధ్య సిబ్బందితో నిరుపయోగంగా ఉన్న దుస్తులు, పాత దుప్పట్లు, పాత పుస్తకాలు వంటి పొడి వస్తువులను సేకరించి రీసైక్లింగ్ సెంటర్లకు పంపించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు వైవీ.అప్పారావు, ధీరావత్ మాధవి, గద్దల మాధురి, మొండితోక నాగరాణి, మున్సిపల్ మేనేజర్ రవీంద్ర, వార్డు ఆఫీసర్లు, వార్డు ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పోటీలో బహుమతి



విజేత మార్త ప్రసాద్

మధిర: ఖమ్మంలో సోమవారం జరిగిన సీఎం కప్ స్విమ్మింగ్ పోటీల్లో మధిర అసోసియేషన్ తరఫున పాల్గొన్న మార్త ప్రసాద్ ద్వితీయ బహుమతి సాధించాడు. 100 మీటర్ల ఫ్రీ స్టైల్‌లో ఆయన ఉత్తమ ప్రతిభను చాటి బహుమతి దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ మధిర అసోసియేషన్ అధ్యక్షుడు జంగా నరసింహారెడ్డి, రామాలయం కమిటీ చైర్మన్ పల్లపోతు ప్రసాద్ రావు, స్విమ్మర్స్ అభినందించారు.

4న సీపీఐ ప్రజా గర్జన

సత్తుపల్లిరూరల్: జూన్ 4న కొత్తగూడెంలో జరిగే సీపీఐ ప్రజా గర్జన బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ పిలుపునిచ్చారు. సత్తుపల్లిలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో మోదీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమానికి కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు, పార్టీ సభ్యులు, సానుభూతి పరులు హాజరుకావాలన్నారు.

సత్తుపల్లిలో విత్తన షాపుల తనిఖీ

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని విత్తన దుకాణాలలో సోమవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. దుకాణాలలోని స్టాక్ వివరాలు, లైసెన్స్‌లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వెంకటేశ్వర్లు, ఏఎస్సై జయబాబు, టాస్క్‌ఫోర్స్ హెడ్‌కానిస్టేబుల్ జనార్దన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు అధైర్యపడొద్దు

వైరారూరల్: పది పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు అధైర్య పడకుండా ఉపాధ్యాయుల సూచనల మేరకు చదివి ఉత్తీర్ణత సాధించాలని ఎంపీడీఓ శ్రీదేవి సూచించారు. గన్నవరం జెడ్పీహెచ్‌ఎస్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను సోమవారం ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు లాల్ మహ్మద్, సర్పంచ్ విజయలక్ష్మి, ఎంపీటీసీ సౌజన్య, హెచ్‌ఎం సైదయ్య పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్‌పాస్‌లు పంపిణీ

బోనకల్: మండలంలోని ఆళ్లపాడు గ్రామంలో 25 మందికి దివ్యాంగులకు గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం బస్‌పాస్‌లను సర్పంచ్ తిరుపతిరావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బరకయ్య, ఆర్టీసీ డిపో అధికారులు నాగుల్‌మీరా, చిన్నబాబు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లకు నియామక పత్రాలు

కల్లూరు: కల్లూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని కల్లూరు, సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి, తల్లాడ, ఏన్కూరు మండలాలకు సంబంధించి రేషన్ డీలర్ల ఎంపిక స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో జరిగింది. వీరికి సోమవారం ఆర్డీఓ సీహెచ్ సూర్యనారాయణ అర్హులైన 47 మంది రేషన్ డీలర్లకు నియామక పత్రాలు అందజేశారు.

ఆర్థిక సాయం

కల్లూరు రూరల్: మండలంలోని ముచ్చవరంలో ఇటీవల గాలి దుమారంతో రేకుల షెడ్డు పూర్తిగా నేల మట్టం అయిన దుగ్గిరాల సావిత్రి, రాయప్పలకు గ్రామ సర్పంచ్ గంగవరపు శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ సరాబు వెంకటేశ్వరావు, వార్డు సభ్యులు ముదిగొండ రామారావు సోమవారం రూ.15,000లు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో బాబ్జిప్రసాద్, ఆర్ఐ స్టాలిన్, సొసైటీ వైస్ చైర్మన్ రావి చెట్టి కొండల్‌రావు పాల్గొన్నారు.

కంటి వెలుగు ప్రారంభం

వైరారూరల్: మండలంలోని గన్నవరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన రెండో విడత కంటి వెలుగు వైద్య శిబిరాన్ని సోమవారం జెడ్పీ కోప్షన్ సభ్యుడు షేక్.లాల్ మహ్మద్, సర్పంచ్ వేమిరెడ్డి విజయలక్ష్మీలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీదేవి, ఎంపీటీసీ యరమాల సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

వల్లబి పీహెచ్‌సీకి అనారోగ్యం

అన్ని సౌకర్యాలున్నా.. అందని వైద్య సేవలు

- సమయానికి రాని ఆస్పత్రి సిబ్బంది.. లేదంటే సెలవులకే పరిమితం
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న రోగులు



వల్లబి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



ల్యాబ్ టెక్నీషియన్ కుర్చీ ఖాళీగా ఉన్న దృశ్యం

ముదిగొండ: ముదిగొండ మండలంలోని వల్లబి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రభుత్వం పేదలకు వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో రూ.లక్షలు వెచ్చించి అన్ని సౌకర్యాలతో తీర్చిదిద్దారు. ఆలక్ష్యం ఇక్కడ నెరవేడం లేదు. పేదలకు పూర్తిస్థాయి వైద్య సేవలు అందడం లేదు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఆస్పత్రిలోని వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలి. కానీ ఇక్కడ సరైన వైద్య సేవలు అందడం లేదని ఆరోపణలొస్తున్నాయి. ఆస్పత్రిలో సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో వైద్య నిమిత్తం వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వల్లబి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నిత్యం మల్లారం, బాణాపురం, గందసిరి, కమలాపురం, అయ్యగారిపల్లి, పమ్మి, మల్లన్నపాలెం, వనంవారికిష్టాపురం, వల్లాపురం, అమ్మపేట గ్రామాల్లోని ప్రజలు వారి రోగాల నిమిత్తం ఇక్కడకు వస్తుంటారు.

ఆస్పత్రిలో సిబ్బంది వివరాలిలా..

పీహెచ్‌సీలో 10 మంది ఏఎన్‌ఎమ్‌లు, నలుగురు స్టాఫ్ నర్సులు, ఒక ల్యామ్ టెక్నీషియన్, ఒక వైద్యాధికారి, ఒక ఫార్మసిస్ట్ ఉన్నారు.

ఉన్న సిబ్బందితోనే సేవలు అందిస్తున్నాం..

వైద్య సేవలు అందని విషయమై వైద్యాధికారి ధర్మేందర్‌ను వివరణ కోరగా.. ప్రస్తుతం 10 మంది ఏఎన్ఎంలకు ఇద్దరు కంటి వెలుగు ప్రోగ్రాంలో, మరో నలుగురు ఫీల్డ్‌లో, మరో నలుగురు సెలవులో ఉన్నారని తెలిపారు. స్టాఫ్‌నర్సులు ఇద్దరు డిప్యూటేషన్‌లో, మరొకరు సెలవులో ఉన్నారన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ కూడా సెలవులోనే ఉన్నాడని కావున ఇక్కడ ఉన్న సిబ్బందితోనే వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు.

రోగులకు అందని వైద్య సేవలు..

సోమవారం వివిధ పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి వచ్చిన రోగులు గంటల కొద్ది పడిగాపులు కాచారు. ఉన్న ఒక్క స్టాఫ్‌నర్స్, వైద్యాధికారి, ఫార్మసిస్ట్‌తో ఆస్పత్రిలోని రోగులకు సేవలు అందిస్తున్నారు. ఆస్పత్రిలో ప్రతి వార్డుకు సంభందిత సౌకర్యాలు ఓ కార్పొరేట్‌కు దీటుగా నమకూర్చిన పరికరాలున్నాయి. ఆస్పత్రిలో కేవలం నెలకు రెండు, మూడు కాన్పులు మాత్రమే జరుగుతున్నాయి. వల్లబి గ్రామంలో దాదాపు ఐదు వేల మందితో పాటు పరిసర ప్రజలకు అందుబాటులో ఉండి అన్ని సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన వైద్యశాలలో కొందరే విధులకు హాజరు కావడంతో రోగులకు సరైన వైద్యం అందడం లేదని ప్రజలు వాపోతున్నారు.

షుగర్ పరీక్ష చేయించుకుందామని వచ్చా..



షుగర్ పరీక్ష చేయించుకుందామని వస్తే పరీక్షలు చేసేవారు లేరు. నేను వచ్చి చాలా సేపు అవుతుంది. ఎవరిని అడగాలో తెలియడం లేదు. పరీక్షలు చేయించుకుని మందులు వాడదామని ఆస్పత్రికి వచ్చాను. డాక్టర్లు ఎప్పుడు వస్తారో మరి.

– మార్తమ్మ, అంధురాలు, వల్లబి

రోజూ ఆస్పత్రికి వస్తున్నా..



ఐదు రోజుల నుంచి రోజూ ఆస్పత్రికి వస్తున్నా.. పరీక్షలు చేసుకుందామని అన్ని నమూనాలు ఇచ్చా, రిపోర్టుల కోసం ఐదు రోజుల నుంచి ఆస్పత్రి చుట్టూ తిరుగుతున్నా. ఇక్కడికి వస్తే పరీక్షలు చేసేవారు, రిపోర్టులు ఇచ్చేవారు లేరు. రోజు ఎండలో వచ్చి వెళ్లాల్సి వస్తుంది. ఏ సారు ఎప్పుడు వస్తారో తెలియడం లేదు.

– తేజావత్ శ్రీను, బాణాపురం తండా

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



వైరాలో డాక్టర్ ఉదయలక్ష్మికి వినతిపత్రం ఇస్తున్న ఆశా కార్యకర్తలు

వైరా/తల్లాడ: ఆశా వర్కర్ల పని విధానాన్ని రద్దు చేయాలని సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో వైరా, తల్లాడ పీహెచ్‌సీ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని వైరా వైద్యాధికారి డాక్టర్ ఉదయ లక్ష్మికి, తల్లాడ వైద్యాధికారులు రత్న మనోహర్, ఆల్తాఫ్ లకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ పట్టణ కార్యదర్శి అనుమోలు రామారావు, తోట నాగేశ్వరరావు, సీఐటీయూ మండల కార్యదర్శి షేక్ మస్తాన్‌లు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించే ఆశా కార్యకర్తలను రాత పరీక్షల పేరుతో వారి సంఖ్యను తగ్గించే ప్రయత్నం చేస్తుందన్నారు. ఆశాల పట్ల ప్రభుత్వ వైఖరిని విరమించుకోవాలన్నారు. ఆశ వర్కర్లను రెగ్యులర్ చేసి, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు శైలజ, ఆదిలక్ష్మి, విజయ, రేణుక, ఆదికుమారి, మమత, పుష్ప, తాళ్ల రాణి, దేవ కరుణ, కృష్ణకుమారి, ధనలక్ష్మి, కల్యాణి, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని మంత్రికి వినతి



మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కిరణ్

సత్తుపల్లి: ఖమ్మం కేంద్రంలో జర్నలిస్టులకు 23.5 ఎకరాలు భూమి కేటాయించినట్లుగానే సత్తుపల్లిలో కూడా అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందించాలని రాష్ట రవాణాశాఖా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను సోమవారం ఖమ్మంలో టీయూడబ్ల్యూజే జిల్లా కోశాధికారి తోట కిరణ్ కలిసి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు జమ్ముల రాజేష్‌రెడ్డి, వి.రామారావు, బొల్లి పోగు సురేష్, శ్రీను పాల్గొన్నారు.

సోక్ పీట్‌లకు శంకుస్థాపన

బోనకల్: మండలంలోని రావినూతల,లక్ష్మీపురం,బోనకల్, గార్లపాడు గ్రామాల్లో సోమవారం స్వచ్ఛ సర్వేక్షన్ అభియాన్ కింద ఇంటింటికి వ్యక్తిగత సోక్ పీట్‌ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వేణు మాదవ్ మాట్లాడుతూ.. అన్ని గ్రామాలలో సోక్ పీట్‌ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శాస్త్రి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కేసు నమోదు

చింతకాని: మండలంలోని తిమ్మినేనిపాలెం గ్రామానికి చెందిన తెల్లగొర్ల వెంకటి అను వ్యక్తిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఏట్కూరి ఖాదర్ బాబు వ్యవసాయ పొలాన్ని వెంకట్ కౌలుకు తీసుకుని మొక్కజొన్న పంట సాగుచేశాడు. గత శుక్రవారం మొక్కజొన్న చొప్పకు నిప్పు పెట్టాడు. ఈ క్రమంలో చుట్టుపక్కల రైతులకు చెందిన వ్యావసాయ పొలాల్లో ఉన్నటువంటి విద్యుత్ మోటార్లు, పైపులతో పాటు ఖాదర్ బాబుకు చెందిన మూడు ఎకరాల జామాయిల్ తోట దగ్ధమైంది. బాధిత రైతులు సుమారు రూ.60 వేల నష్టం వాటిల్లినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై పొదిల వెంకన్న కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీఎన్జీవోస్ సభ్యత్వ నమోదు

తల్లాడ: తల్లాడలో సోమవారం తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం సభ్యత్వ కార్యక్రమం జరిగింది. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు అఫ్జల్ హీసన్, కార్యదర్శి ఆర్‌వీస్ సాగర్ పిలుపు మేరకు తహసీల్దార్ కార్యాలయం, గ్రామ పంచాయతీ కార్యాలయం, ఫారెస్ట్ కార్యాలయం, పీహెచ్‌సీ, హోమియోపతి ఆస్పత్రి నందు సభ్యత్వం చేర్పించారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీఓ కల్లూరు యూనిట్ అధ్యక్షులు వజీరుద్దీన్, కె.పెద్ద పుల్లయ్య, ఏఈఓ నాగులీమీరా, టి.రంగారావు, రాజేశ్వరీ, జాన్సీ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాములునాయక్

కారేపల్లి: మండలంలోని సీతారాంపురం గ్రామంలో అభయాంజనేయ స్వామి దేవాలయంలో సోమవారం శిలాధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని సోమవారం గ్రామస్తులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ పాల్గొని ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సీతారాంపురం గ్రామస్తులు, రియల్ ఎస్టేట్ వ్యాపారి మన్నేటి నాగేశ్వరరావు-స్రవంతి దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

కంఠమహేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్న పూజారులు, భక్తులు

ముదిగొండ: మండలంలోని వల్లబిలో గౌడసంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీకంఠమహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం కంఠమహేశ్వర స్వామి, సురమాంబ దేవి, గణపతి, నందీశ్వర సహిత కోడిపుంజు, కౌండన్య మహర్షి, వనం ఎల్లమ్మ, వనం మైసమ్మ, దేవతామూర్తుల ప్రతిష్ఠామహోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది. పురోహితులు మట్టపల్లి మల్లిఖార్జున శర్మ, మహంకాళి రామప్పశాస్త్రి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

వననర్సరీల పరిశీలన

ముదిగొండ: మండలంలోని మల్లారం, వల్లబి గ్రామాల్లోని వననర్సరీలు, కంపోస్టు షెడ్‌లను సోమవారం ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ సూర్యనారాయణలు పరిశీలించారు. నర్సరీల్లోని మొక్కలు ఎండిపోకుండా షేడ్‌నెట్స్ ఏర్పాటు చేయాలని సూచించారు.

కేసీఆర్ కిట్ అందజేత

తల్లాడ: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నార్మల్ డెలివరీ అయిన మహిళకు మండల వైద్యాధికారి రత్న మనోహర్ 15 వస్తువులతో కూడిన కేసీఆర్ కిట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆల్తాఫ్, సూపర్‌వైజర్ పుల్లయ్య, స్టాఫ్ నర్సు బిందు కళావతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వేతన ఒప్పందాల్లో ఐఎన్‌టీయూసీ విజయం



మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ త్యాగరాజు

సత్తుపల్లిరూరల్: కలకత్తాలో జరిగిన వేతన ఒప్పంద సమావేశంలో సింగరేణి కార్మికుల వేతన ఒప్పందాలపై ఐఎన్‌టీయూసీ, ఎస్‌సీఎంఎల్‌యూ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్, శాశ్వత వేజ్‌బోర్డు సభ్యులు సంతకాలు చేశారని ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ త్యాగరాజు, కేంద్రకమిటీ సెక్రటరీ రావి నాగేశ్వరరావులు తెలిపారు. జేవీఆర్ ఓసీలో సోమవారం కార్మికులతో గేట్ మీట్ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి కార్మికులకు అలవెన్స్‌పై 25 శాతం, 19శాతం ఎంజీబీ పెరిగిందన్నారు. అన్ని జాతీయ సంఘాలతో కలిసి అగ్రిమెంట్ చేశామన్నారు. ఐఎన్‌టీయూసీ మొదటి నుంచి చెప్పిన విధంగానే దేశంలోని ఇతర ప్రభుత్వ పరిశ్రమల కంటే పది వెజ్‌బోర్డుల కంటే మెరుగ్గా కార్మికులకు లాభం వచ్చేలా ఒప్పందాలు జరిగాయన్నారు. కార్మికుల కొత్త జీతాలు కేంద్రప్రభుత్వ అనుమతి డీపీఈ రాగానే జులై 1 నుంచి చెల్లిస్తారని వివరించారు. ఈ సమావేశంలో ఏరియా వైస్ ప్రెసిడెంట్ కె.అల్బర్ట్, బ్రాంచ్ సెక్రటరీ ప్రసన్న, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ తిరుమలరావు, సక్రు, బాలాజీ, ఎస్‌కె బాజీ, మారబోయిన ప్రసాద్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత



బీమా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

పెనుబల్లి : ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని బయ్యన్నగూడెం గ్రామానికి చెందిన వంకాయలపాటి పుల్లారావు మృతి చెందాడు. ఆయనకు బీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వం ఉండడంతో రూ.2 లక్షల బీమా చెక్కును భార్యకు సోమవారం సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య చేతుల మీదుగా అందజేశారు. బీఆర్‌ఎస్ సభ్యత్వం తీసుకున్న ప్రతీ కుటుంబానికి నేనున్నానంటూ సీఎం కేసీఆర్ అండగా ఉంటారన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు వెంకట్రావు, కార్యదర్శి ప్రసాద్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు అశోక్‌కుమార్, గ్రామ సర్పంచ్ శ్రీలేఖ, నాయకులు సుమన్, సత్యం, నరసింహాస్వామి, వెంకటసత్యం, రవి, తిరుపతయ్య, కోటయ్య, మురళీ పాల్గొన్నారు.

ఏసీ క్యాంపస్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే..

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన న్యూలిటిల్ ఫ్లవర్స్ ఏసీ క్యాంపస్ సెకండ్ బ్రాంచ్‌ని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ సోమవారం ప్రారంభించారు అనంతరం వైరాలోని పలు కుటుంబాలను ఆయన పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు, దిశ కమిటీ సభ్యుడు కట్టా కృష్ణార్జునరావు, వార్డు కౌన్సిలర్ సునీత, నాయకులు మోహన్‌రావు, డాక్టర్ కోటయ్య, విశ్వేశ్వరరావు, డాక్టర్ మురళీ కృష్ణ, లక్ష్మీ రాజ్యం, డాక్టర్ శ్యాంబాబు, డాక్టర్ భాస్కరరావు, సత్యంబాబు తదితరులున్నారు.

కూలీలకు మెడికల్ కిట్లు, మజ్జిగ పంపిణీ



ఉపాధి కూలీలకు మెడికల్ కిట్లు అందిస్తున్న మట్టా దయానంద్, నాయకులు

తల్లాడ: మండలంలోని మిట్టపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను సోమవారం జిల్లా నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ సందర్శించారు. పనులు చేస్తున్న వారిని కలిసి పని వేతనం, ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి మెడికల్ కిట్లు, మజ్జిగ ప్యాకెట్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మట్టా రాగమయి, బీసీ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్, శ్రీను, గణేశుల రవి, జంగా సిద్ధారెడ్డి, గొడుగునూరి లక్ష్మారెడ్డి, మాగంటి శ్రీను, మాగంటి వెంకటేశ్వర్లు, సుదాకర్, నరసింహారావు, పైయాజ్, బలరాం తదితరులు పాల్గొన్నారు.

పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలి



కూలీలతో మాట్లాడుతున్న షేక్ ఖాసీం

కొణిజర్ల: ఉపాధి హామీ కార్మికులు పని చేసే ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎస్) జిల్లా నాయకుడు షేక్ ఖాసీం అన్నారు. మండలంలోని సిద్దిక్ నగర్‌లో జరుగుతున్న ఉపాధి పనులను సోమవారం ఆ సంఘం నాయకులు పరిశీలించి పని ప్రదేశాలలో సౌకర్యాలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించడంలో పూర్తిగా విఫలం అయ్యాయని తెలిపారు. ఉపాధి కూలీలకు రూ.600 వేతనం అందించాలన్నారు. కనీస అవసరాలైన టెంట్, తాగునీరు, మెడికల్ కిట్ వంటి కనీస సౌకర్యాలు కూడా ఏర్పాటు చేయడం లేదన్నారు. అడిగిన వారందరికీ పని కల్పిస్తామని చెప్పి ఇప్పుడేమో జాబ్ కార్డులు మంజూరు చేయడంలో తాత్సారం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట నాయకులు చల్లా ఉపేందర్, పామర్తి శ్రీనివాసరావు, షేక్ హుస్సేన్, తాటి కింది వెంకన్న తదితరులు ఉన్నారు.

నిరుద్యోగ మార్చ్‌ను విజయవంతం చేయాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

ఎర్రుపాలెం: ఈ నెల 27న ఖమ్మం పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన నిరుద్యోగ మార్చ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ అసెంబ్లీ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు కోరారు. సోమవారం మండల కేంద్రంలోని ఎస్‌జేకేఎం జూనియర్ కళాశాలలో నిరుద్యోగ మార్చ్ పోస్టర్లను స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవినీతి, లీకేజీ, లిక్కర్ మాఫియా, కుటుంబ పాలనను అంతమొందించటం కోసం నిరుద్యోగులు, విద్యార్థులు, బీజేపీ కార్యకర్తలు, అభిమానులు నిరుద్యోగ మార్చ్‌కు అధిక సంఖ్యలో రావాలన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్షుడు ముక్కపాటి శ్రీనివాసరావు, పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర కమిటీ సభ్యులు నూతక్కి నరసింహారావు, నాయకులు పెరుమాళ్లపల్లి విజయరాజు, సిలివేరు సాంబశివరావు, దేవరకొండ కోటేశ్వరరావు, మిర్యాల నాగేశ్వరరావు, మిర్యాల వెంకటేశ్వరరావు, బొక్కా రమేష్, వేముల రామకృష్ణ గౌడ్, పిట్టల గోపాలరావు, వేమా ఏడుకొండలు, మల్లెల మోహన్‌రావు, కోటపాటి ధర్మారావు, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి నృత్య శిక్షణాశిబిరం



విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని స్టెప్‌అప్ డ్యాన్స్ అకాడమి ఆధ్వర్యంలో 40 రోజుల పాటు చిన్నారులకు నిర్వహించిన వేసవి నృత్యశిక్షణా శిబిరం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా స్థానిక కళాభారతిలో జరిగిన కార్యక్రమంలో చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రథమ, ద్వితీయ బహుమతులను కౌశల్, సుమయ గెలుపొందారు. వీరికి డాక్టర్ మట్టా దయానంద్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందించారు. నృత్య శిక్షణా డ్యాన్స్‌మాస్టర్ కిన్నెర మణిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ చంద్రశేఖర్‌రెడ్డి, నారాయణవరపు శ్రీనివాస్, సుబ్బారెడ్డి, వెంకటేశ్వరరావు, గణేష్, మనోజ్, నాగు, అజయ్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ సమావేశాలు విజయవంతం చేయండి


సత్తుపల్లిటౌన్: హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 27, 28 తేదీల్లో జరగనున్న డీవైఎఫ్ఐ ఆలిండియా కేంద్ర కమిటీ సమావేశాలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సత్తెనపల్లి నరేష్ పిలుపునిచ్చారు. స్థానిక రావి వీరవెంకయ్య భవనంలో సోమవారం జరిగిన సమావేశంనిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యురాలు రోషిణి, ప్రసాద్, ఉదయ కుమారి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మధిర: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఈ నెల 23న మధిర, ఎర్రుపాలెం, బోనకల్ మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ మధిర సబ్ డివిజన్ ఏడీఈ ఎం.అనురాధ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దగోపతి 220 కేవీ సబ్‌స్టేషన్ నుంచి వయా ఖమ్మం మీదుగా మధిర 132 కేవీ సబ్ స్టేషన్‌కు విద్యుత్ సరఫరా అయ్యే విధంగా పనులు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. దీనిలో భాగంగా నేడు ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు మధిర 132 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని మధిర, ఎర్రుపాలెం, బోనకల్ మండలాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తునట్లు ఆమె తెలిపారు.

ఏన్కూరు: మండల కేంద్రంలోని సినిమాహాల్ ఎదురుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో మంగళవారం విద్యుత్ కోతలు విధిస్తున్నట్లు ఏఈ వెంకటేశ్వరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటలకు విద్యుత్ కోతలు విధిస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించవలసిందిగా కోరారు.

ఆక్రమణకు గురైన రహదారి స్వాధీనం



రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ రేణుక

సత్తుపల్లిరూరల్: మండలంలోని కిష్టారం గ్రామంలో ఆక్రమణకు గురైన గ్రామ పంచాయతీ రహదారిని సోమవారం సర్పంచ్ చెట్టుమాల రేణుకఈశ్వర్ ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంబేడ్కర్‌నగర్ కాలనీలో నివసిస్తున్న కుటుంబాల పిల్లలు ప్రభుత్వ పాఠశాలకు రావడానికి హైవే రోడ్డు మీద నడవాల్సి వస్తుందని, చిన్న పిల్లలు హైవేరోడ్డుపై నడవడం చాలా ప్రమాదకరంగా ఉందన్నారు. ఆక్రమణకు గురైన సుమారు 600 మీటర్ల రోడ్డును నక్షా ప్రకారం గుర్తించి గ్రామపంచాయతీ స్వాధీనం చేసుకొని మరల రోడ్డును పనరుద్ధరించడం ద్వారా విద్యార్థులు పాఠశాలకు వెళ్లడానికి చాలా సౌకర్యంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొలపనేని ధనుంజయ్‌రావు, సభ్యులు దాసు, గ్రామపెద్దలు అప్పారావు, రాజు, నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి రవి, రైతులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.